క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను నియమించాలి

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటిని కల్పించే ఉద్దేశంతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను నియోజకవర్గ వ్యాప్తంగా త్వరగా పూర్తిచేయాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ కమిటీలో బీసీ, ఎస్సీ, ఎస్టీతో పాటు ఇద్దరు డ్వాక్రా సంఘాల సభ్యులకు అవకాశం కల్పించాలన్నారు. పూర్తిచేసిన వివరాలను తమ క్యాంపు కార్యాలయంలో అందజేయాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాటిందని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ సూచించారు. మున్సిపాలిటీకి చెందిన సురేశ్‌నాయక్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మాజీ మంత్రి పి.సబితారెడ్డి చొరవతో మంజూరైన రూ.25వేల చెక్కును మంగళవారం కౌన్సిలర్ లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

హోంశాఖ మాజీ మంత్రిని కలిసిన చైర్‌పర్సన్



దేవేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్, బీజేపీ నాయకులు

తుక్కుగూడ: హోంశాఖ మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్‌ను ఇటీవల తుక్కుగూడ పురపాలక సంఘం చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బరిగెల హేమలతరాజు గౌడ్ దంపతులు మంగళవారం శ్రీనగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రస్తుత రాజకీయ విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, కౌన్సిలర్లు శివకుమార్, ఆర్.రాజు, నాయకులు సుధాకర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా ఇబ్రాం శేఖర్



బడంగ్‌పేట్: బాలాపూర్‌కు చెందిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌ను బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా నియమించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీఎస్పీ ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ జాతీయ నేతలు, రాష్ట్ర పార్టీ నాయకులు కలిసి శేఖర్‌ను రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ.. నియామకానికి పూర్తి సహకారం అందించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

రేపు క్విజ్ పోటీలు

చంపాపేట: అర్క్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్రిస్టేజ్ సమావేశ మందిరంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాలాపూర్, సరూర్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు ఎలాంటి రుసుం లేకుండా పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారని ఆసక్తి ఉన్న వారు 7670997065 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో టమాట రూ.47, వంకాయ రూ.35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ.40, కాకర రూ.38, బీర రూ.38, క్యాబేజీ రూ.23, ఫ్రెంచి బీన్స్ రూ.85, క్యారెట్ రూ.45, దొండ రూ.35–40, చిక్కుడు రూ.35–65, గోకర రూ.40, బీట్‌రూట్ రూ.25, క్యాప్సికం రూ.65, ఆలు రూ.37, ఉల్లిగడ్డ రూ.45 ఈ ధరలు బుధవారం వరకు అమలులో ఉంటాయి.



నేదునూరు–మాన్యగూడ మధ్యలో గుంతలమయంగా మారిన రోడ్డు



రహదారిపై ఏర్పడ్డ గుంత

గుంతల దారి.. అవస్థలే మరి!

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కందుకూరు: మేజర్ గ్రామ పంచాయతీ నుంచి దాని అనుబంధ గ్రామం మధ్య రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కేవలం కిలోమీటర్ దూరం ఉన్న రహదారి గుంతలమయంగా తయ్యారయింది. అయినా సంబంధిత అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదీ మండల పరిధిలోని నేదునూరు–మాన్యగూడ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు దుస్థితి. నిత్యం గ్రామస్తులు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. అస్తవ్యస్తమైన రహదారితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కిలోమీటర్ మాత్రమే

నేదునూరు గ్రామం నుంచి దాని అనుబంధ గ్రామమైన మాన్యగూడ మధ్య కేవలం కిలోమీటర్ దూరం మాత్రమే ఉంది. కాగా ఆ రహదారి ప్రస్తుతం గుంతలమయంగా మారింది. దీంతో అక్కడి ప్రజలు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నేదునూరులో ఉండటంతో పాటు ఎక్కడికి వెళ్లాలన్నా నేదునూరు మీద నుంచే అధికంగా రాకపోకలు సాగించాల్సిందే. దీంతో వారికి తిప్పలు తప్పడంలేదు. మరోపక్క రావిచేడు ఆపై గ్రామాల ప్రజలు కందుకూరు వైపు రావాలంటే ఇదే దగ్గరి దారి. ఆ రహదారికి కనీసం మరమ్మతులు చేయిస్తే ప్రయాణం సాఫీగా సాగుతుందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

> **నిధులు మంజూరయ్యాయి**
>
> నేదునూరు–మాన్యగూడ గ్రామాల మధ్య ఉన్న రహదారి మరమ్మతులకు రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. టెండర్ పూర్తయితే కాంట్రాక్టర్ వెంటనే పనులు ప్రారంభిస్తారు. ఈ ప్రక్రియ వేగవంతానికి కృషి చేస్తా.
>
> – సతీష్‌రెడ్డి, ఏఈ పీఆర్, కందుకూరు

విద్యుత్ శాఖలో భారీగా బదిలీలు

మహేశ్వరం: తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ కందుకూరు డివిజన్‌లో పనిచేస్తున్న డీఈఈ, ఏడీఈ, ఏఈఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్ల ఉద్యోగుల బదిలీలు ఇటీవల జరిగాయి. అటెండర్ మొదలుకొని డీఈఈ స్థాయి కేడర్ వరకు ప్రభుత్వం స్థాన చలనం కల్పించారు. కందుకూరు డీఈఈగా ఇదివరకు పనిచేసిన రాజారామ్‌రెడ్డి సరూర్‌నగర్ డీఈ టెక్నికల్‌కు బదిలీ అయ్యారు. మామిడిపల్లి ఏడీఈగా పనిచేసిన వెంకటనర్సింహారెడ్డి ప్రస్తుతం చంపాపేట్, ఆమన్‌గల్ ఏడీఈగా పనిచేసిన శ్రీనివాస్ తుర్కయంజాల్‌కు బదిలీ అయ్యారు. కందుకూరు ఏఈ రమేశ్‌గౌడ్ కొత్తురుకు, ఆమన్‌గల్ ఏఈ సీతారామ్ ఏఈ నుంచి పదోన్నతి పొంది ఇబ్రహీంపట్నం ఏడీఈగా వెళ్లారు. తలకొండపల్లి ఏఈ కతారియా ఏఈ నుంచి సికింద్రాబాద్‌కు బదిలీ అయ్యారు. ఏడు మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో నరేందర్‌రెడ్డి తలకొండపల్లి నుంచి ఆమన్‌గల్, డి.కుమార్ మహేశ్వరం–బాలాపూర్, తావూ కందుకూరు–మహేశ్వరం, సయ్యద్ సూజాత హుస్సేన్ బాలాపూర్–తుక్కుగూడ, ఊనియా రాచూలూర్–తలకొండపల్లి, రమేశ్‌కుమార్ తుక్కుగూడ–రాచులూర్, యాదయ్య ఆమన్‌గల్–కందుకూరు సెక్షన్‌కు బదిలీ అయ్యారు. లైన్‌మెన్లు 13 మంది బదిలీ అయ్యారు. రాములు పులిమామిడి–బాలాపూర్ సెక్షన్, రాజోజీ కందుకూరు–కడ్తాల్, యాదయ్య కడ్తాల్–జల్‌పల్లి, కృష్ణయ్య తలకొండపల్లి–కడ్తాల్, సయ్యద్ షర్ఫుద్దీన్‌గౌస్‌నగర్–అమీర్‌పేట్(మహేశ్వరం), వెంకటయ్య కడ్తాల్–తలకొండపల్లి, కె.రమేశ్ బాలాపూర్–రావిర్యాల, రామనాథం రావిర్యాల–పులిమామిడి, శ్రీనివాస్ తుక్కుగూడ–లేమూర్, నవీన్ అమీర్‌పేట్(మహేశ్వరం)–గౌస్‌నగర్, సత్యనారాయణ లూమూర్–ఎర్రకుంట వాదివూదాకాలనీ, ఈ.రమేశ్ జల్‌పల్లి–కందుకూరు, మహ్మద్ అబ్దుల్ వాహిద్ ఎర్రకుంట వాదివూదా–తుక్కుగూడకు బదిలీ అయ్యారు.

ఇరు కుటుంబాలపై కేసు

నాగోలు: తరచూ గొడవలు పడుతున్న రెండు కుటుంబాల సభ్యులపై కేసు నమోదైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోలు గ్రామానికి చెందిన బైకాన్ మల్లేష్, బైకాన్ సతీష్ యాదవ్, బైకాన్ మహేష్ యాదవ్, బైకాన్ సాయిలు యాదవ్, బైకాన్ బాలకృష్ణయాదవ్, నాగోలు కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీకి చెందిన మైలశ్రీనివాస్ కురుమ, నాగోలు గ్రామానికి చెందిన యెగ్గె కృష్ణ, మైల సాయికుమార్, కర్రె శివలు, బైకాన్ మల్లేష్ కుటుంబ సభ్యులతో గత కొన్ని ఏళ్లుగా గొడవ పడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ఈ నెల 13న ఇరు కుటుంబాల సభ్యుల నడుమ మరోసారి గొడవ జరగడంతో రెండు కుటుంబాల పరస్పర ఫిర్యాదు మేరకు ఇరు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు. మరోసారి గొడవ పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

పీఏసీఎస్ సిబ్బందిపై విచారణ చేపట్టాలి



డీసీసీబీ కార్యాలయంలో సీఈఓకు ఫిర్యాదు పత్రాన్ని అందిస్తున్న డైరెక్టర్లు తదితరులు

కందుకూరు: కందుకూరు పీఏసీఎస్‌లో రైతులకు సేవలు అందించడంలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారని, విచారణ చేయించి రైతు సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలని కోరుతూ మంగళవారం హెచ్‌డీసీసీబీ సీఈఓకు డైరెక్టర్లు సత్తినేని వెంకట్రామిరెడ్డి, సాధ పాండురంగారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట రుణాలు, సాధారణ, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయడంలో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. సొంత ఫైనాన్స్ కంపెనీగా భావించి రైతులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పీఏసీఎస్‌పై విచారణ చేపట్టి రైతులను సొసైటీకి చేరువచేయాలని కోరారు. వారి వెంట రైతులు ఉన్నారు.



వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

గుంతల రోడ్లు..
ఫిర్యాదు చేసినా పట్టించుకోరు!



మన్సూరాబాద్ మల్లికార్జుననగర్‌లో..

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలతో పాటు ప్రధాన రోడ్లపై భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు చిరునామాలుగా మారాయి. గుంతలను పూడ్చాలని సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు జతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతకుంట నుంచి హయత్‌నగర్ మధ్య జాతీయ రహదారిపై భారీ గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. జాతీయ రహదారి పనుల కారణంగా అటుగా వెళ్లలేక కాలనీల నుంచి వెళ్దామంటే అంతర్గత రోడ్లు సైతం గుంతలతో దర్శనమిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని శివారు కాలనీలలో రోడ్లు మరి దారుణంగా మారాయి. శివారు కాలనీల్లో దాదాపుగా అన్ని మట్టి రోడ్లే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొందని కాలనీల వాసులు వాపోతున్నారు. పలు కాలనీల్లో సీసీ, బీటీ రోడ్లు ఉన్నా స్థానికులకు ఇబ్బందులు తప్పటం లేదు.సీసీ, బీటీ రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించకోకపోవడంతో పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గుంతలుగా మారిన రోడ్లకు మరమ్మతు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



అధ్వానంగా మారిన జాతీయ రహదారి



సుష్మా వద్ద కంకర తేలిన రోడ్డు

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక శ్రీ సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ లైట్లను ప్రారంభించాలని వినతి




చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుక్కుగూడ: తుక్కుగూడ నుంచి సర్ధార్‌నగర్ రోడ్డులో హెచ్‌ఎండీఏ నిధుల నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను ప్రారంభించాలని బీజేపీ నాయకులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బరిగెల హేమలతరాజుగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ లైట్లను ఏర్పాటు చేసి దాదాపుగా ఏడాది అవుతున్నా అధికారులు ఇంతవరకు వాటిని ప్రారంభించడం లేదన్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి ఏర్పాటుచేసిన లైట్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

మహేశ్వరం: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీగా రాయితీ అందిస్తోందని, ఆసక్తి కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ఉద్యానవన అధికారిణి సౌమ్య పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. పామాయిల్ మొక్క ఒకటి రూ.200 ఉండగా రైతులకు 90 శాతం సబ్సిడీలో రూ.20లకే అందజేస్తున్నామని తెలిపారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం ఉంటుందన్నారు. మొక్కల రాయితీపై ఎకరాల్లో ఎటువంటి పరిమితి లేదు. ఆయిల్‌పామ్ రైతులకు డ్రిప్ రాయితీ అందిస్తున్నామన్నారు. డ్రిప్ రాయితీ 12.5 ఎకరాలకు పరిమితం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ అందిస్తున్నారని తెలిపారు. యూనిట్ ధరపై 12 శాతం జీఎస్టీని రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ రైతులకు 80–90 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటుకున్న రైతులకు ఎకరానికి రూ.4200 చొప్పున 4 సంవత్సరాల పాటు నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తారని, నాలుగో సంవత్సరం నుంచి పంట దిగుబడి మొదలవుతుందన్నారు. పండ్ల తోటలు వేసుకునే రైతులకు 3 సంవత్సరాల పాటు మెయింటనెన్స్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. మల్చింగ్ వేసుకునే రైతులకు 50 శాతం రాయితీ, నీటి కుంటలకు 50 శాతం రాయితీ, కూరగాయ పందిర్లకు 50 శాతం రాయితీ, వెదురు మొక్కలపై రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. జీడిమెట్ల నుంచి రైతులకు ఉచితంగా టమాటా, వంకాయ, మిర్చీ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, నారును ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. నారు అవసరం ఉన్న రైతులు 30రోజుల ముందుగా మండల ఉద్యానవన అధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం మహేశ్వరం వ్యవసాయ, ఉద్యానవన అధికారుల కార్యాలయాలను, మండల ఉద్యానవన అధికారి సౌమ్య ఫోన్ నెంబర్ 8977714221 సంప్రదించాలన్నారు.

ఎర్రజెండాతో పేదలకు న్యాయం



జెండావిష్కరణలో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి

యాచారం: ఎర్రజెండా నీడలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల పక్షాన పోరాటాలు చేసేది సీపీఎం అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లిలో మంగళవారం పార్టీ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ, రైతుబంధు, ధరణిలో భూ సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రభుత్వం శ్రద్ధ పెట్టడం లేదని అన్నారు. జెండావిష్కరణ చేసిన అనంతరం గ్రామ శాఖల నూతన కార్యదర్శులుగా గుడ్ల జంగయ్య, పోలె శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు జగన్, మొగులయ్య పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి



శిబిరంలో నాయకులు

కడ్తాల్: భవన నిర్మాణ కార్మికులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ సూచించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్), తెలంగాణ భవన నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వంపుగూడ గ్రామంలో భవన నిర్మాణ కార్మికులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు మంగళవారానికి 13వ రోజుకు చేరుకున్నాయి. శిక్షణ శిబిరాన్ని మాజీ ఎంపీటీసీ పర్వతాలు యాదవ్‌తో కలిసి అశోక్ పరిశీలించారు. కార్యక్రమంలో శిక్షణ నిపుణులు పుష్పాంజలి, ప్రభాకర్ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



ట్రంక్‌లైన్ పనులు పరిశీలిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధి ద్వారకాతిరుమల్ కాలనీ నుంచి రెడ్డికాలనీ వరకు జరుగుతున్న ట్రంక్‌లైన్ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా పనులు పూర్తయితే వివిధ కాలనీల వాసులకు వరదనీటి సమస్య తీరుతుందన్నారు. కార్పొరేటర్ వెంట ఎఈ మల్లికార్జునగౌడ్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభ



సభలో పాల్గొన్న ఎంపీడీఓ బాలశంకర్

మంచాల: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని మంచాల ఎంపీడీఓ బాల శంక ర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నోముల గ్రామంలో ఉపాధిహామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథ కం కింద గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నా రు. గ్రామ సభల ద్వారా పనులను గుర్తించడమే గాకుండా బడ్జెట్ కూడా ప్రతిపాదిస్తామన్నారు. పొలాలు, అటవీ ప్రాంతం, చెరువుల వద్ద చేసే పనులను గుర్తించారు.